
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 సిద్దిపేట
మంగళవారం 5 ఆగస్టు 2025





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్

పల్లెప్రజలు, రైతాంగ సాధికారతతోనే
జాతీయ సమైక్యత

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- 'గీతం'లో జాతీయ చర్చాగోష్ఠి ప్రారంభం 7

మందెంట పోతుండే
ఎలమంద

- జీవాల కోసం పచ్చిక బయళ్ల వెంట అలుపెరగని పాదయాత్ర
- నెలల పాటు పల్లెకు దూరం.. 7
- గొర్ల మందతో సహజీవనం
- పాలమూరు నుంచి సిద్దిపేటకు వలసొచ్చే కురుమలు
- ఎండ, వాన, చలిలోనూ బతుకు పోరాటం

నా కూతురు జయారెడ్డి పెళ్లికి విచ్చేయండి

- సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు, ఉమ్మడి జిల్లా కార్యకర్తలు, అభిమానులకు జగ్గారెడ్డి పిలుపు
- వచ్చే నవంబర్ నెలంతా కాంగ్రెస్ కార్యకర్తలకే పూర్తి సమయం
- కార్యకర్తల కూతుళ్లు, చెల్లెళ్ల వివాహాలకు ఆర్థిక సహాయం చేస్తా
- అత్యవసర అనారోగ్య సమస్యలు తలెత్తితే అండగా ఉంటా
- క్యాన్సర్ పేషెంట్ల గురించి నా దృష్టికి తేవాలి

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, ఆగస్టు 4: సంగారెడ్డిలోని రాంమందిర్‌లో ఈ నెల 7న రాత్రి 8.42 గంటలకు నిర్వహించే తన కూతురు జయారెడ్డి వివాహ వేడుకకు హాజరుకావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆహ్వానించారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులకు పేరుపేరునా ఇదే తన ఆహ్వానమంటూ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వెంకటేశ్వరగార్డెన్‌లో కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్టీ బాధ్యతల దృష్ట్యా ఒక్కోసారి ఫోన్ లిఫ్ట్ చేయకున్నా తాను చేసే సహాయంలో ఆలస్యం జరగదని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి



మల్లన్న ఆభరణాలు
ఈవోకు అప్పగింత

కొమురవెల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో గతంలో ఈవోలుగా బాధ్యతలు నిర్వర్తించిన బాలాజీ, రామాంజనేయులు సోమవారం స్వామి వారి బంగారు, వెండి ఆభరణాలను ప్రస్తుత ఈవో అన్నపూర్ణకు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణధికారి కార్యాలయంలో తూకం వేసి పూర్తి వివరాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ భద్రతా సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నులిపురుగుల నివారణకు
సమష్టిగా పనిచేయాలి : కలెక్టర్

సిద్దిపేట/సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

సొంత పిల్లలుగా భావించాలి

వసతి గృహాల్లోని పిల్లలను సొంత పిల్లలుగా భావించి, వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ హైమావతి సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో కామన్ డైట్, సివిల్ పనుల పురోగతిపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. 23 కేజీబీవీ పాఠశాలల మరమ్మతులకు రూ.8.72 కోట్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు రూ.6.06 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు.

పరిశ్రమలతో జిల్లా అభివృద్ధి, యువతకు ఉపాధి

పరిశ్రమల స్థాపన ద్వారా జిల్లా అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న కంపెనీల యజమానులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. టీజీఐఐసీకి కేటాయించిన భూములకు ఫెన్సింగ్ వేయించి వాటిని తమ అధీనంలో ఉంచుకోవాలని సూచించారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి, శనివారం లోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజల నుంచి 157 అర్జీలను స్వీకరించారు.

కొత్త జిల్లాల వారీగా సహకార సంఘాల విభజన!



- గతంలోనే ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా భారీగా పెరిగిన సభ్యుల సంఖ్య
- గ్రామస్థాయిలో విస్తరణకు ప్లాన్
- ఇప్పటికే పూర్తయిన పాలకవర్గాల పదవీకాలం
- ఏడాది పాటు గడువు పెంచిన ప్రభుత్వం

రైతులకు వెన్నుదన్నుగా నిలిచే వ్యవసాయ సహకార సంఘాలను నూతన జిల్లాల ప్రకారం పునర్విభజన చేస్తారా? అన్న చర్చ జరుగుతోంది. గత మార్చిలో సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం పూర్తయింది. మరో ఆరు నెలల పాటు పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించగా, ఆ గడువు సైతం ఈ నెలతో ముగియనుంది. దీంతో కొత్త ఎన్నికలపై ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

– గజ్వేల్, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి)

సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామస్థాయిలో విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించగా, అధికారులు గతంలోనే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. ఈ క్రమంలో జిల్లాలో నూతనంగా 16 సంఘాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ప్రభుత్వం మాత్రం కేవలం 12 సంఘాలకు మాత్రమే ఆమోదం తెలిపినట్లు సమాచారం. అయితే, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. గ్రామాల్లో సేవలను విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు సహకార సేవలను మరింత చేరువ చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది.

లక్షా 55వేల మంది సభ్యులు..

ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా లక్షా 55 వేల మంది సభ్యులు ఉన్నారు. జిల్లాల పునర్విభజన, మండలాల పునర్విభజన జరిగిన నేపథ్యంలో కొత్త మండలాలకు సహకార సంఘాలు లేకపోవడంతో ఆయా మండలాల వారీగా సంఘాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అంతేకాకుండా, జిల్లా స్థాయిలోనే డీసీసీబీ ఏర్పాటు చేయాలనే కసరత్తు జరుగుతున్నట్లు కూడా తెలుస్తోంది.

12 కొత్త సంఘాలకు ఆమోదం?

సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే ఉన్న 21 ప్రాథమిక వ్యవసాయ సంఘాలకు అదనంగా మరో 16 కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. వీటిలో ప్రభుత్వం 12 సంఘాలకు మాత్రమే వెసులుబాటు కల్పించినట్లు సమాచారం. పునర్విభజనకు సంబంధించిన వివరాలు ప్రభుత్వానికి సమర్పించి నెలలు గడుస్తున్నా, ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సహకార సంఘాల విభజన జరుగుతుందా లేదా అనే అనుమానం ఆశావహుల్లో నెలకొంది. కొత్త మండలాల్లో సహకార సంఘాలను ఏర్పాటు చేస్తే తమకు పీఏసీఎస్

మిగతా8వ పేజీలో



ఎన్‌జీసీ, బయోటెక్నాలజీ మధ్య ఒప్పందం

మెడికల్ కోడింగ్ ఉచిత శిక్షణ

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ విద్యార్థులకు ఉచిత మెడికల్ కోడింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణను నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్ (ఎన్‌జీసీ) సహకారంతో అందిస్తారు. ఈ మేరకు సోమవారం నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్ బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ మధ్య ఐదేళ్ల కాలానికి ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా వారం పాటు ఆన్‌లైన్‌లో మెడికల్ కోడింగ్ శిక్షణ అందించి, విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేస్తారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సునీత, బయోటెక్నాలజీ విభాగాధిపతి వి.రోహిణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, బయోటెక్నాలజీ అధ్యాపకులు ఎం.వేణు, ఎన్‌జీసీ ప్రతినిధులు పవన్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ నుంచి
ఇంటిపన్ను వసూలుపై ఆరా!

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పోతిరెడ్డిపల్లిలో విచారణ చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ

చేర్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లిలో పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారుల పింఛన్ నుంచి ఇంటి పన్ను వసూలు చేసిన విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ విచారణ చేపట్టారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సోమవారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పింఛన్ పంపిణీ, ఇంటి పన్నుల వసూలుకు సంబంధించిన రికార్డులు, రశీదులను పరిశీలించారు. స్థానికులను, లబ్ధిదారులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బును ఎస్‌టీవో లో జమ చేయలేదని నిర్ధారించారు. ఆ మొత్తాన్ని ఎస్‌టీవోలో జమచేయాలని కార్యదర్శి రజితకు సూచించారు. విచారణలో తేలిన అంశాలపై తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఎంపీడీవో మహబూబ్ అలీ తెలిపారు. కార్యదర్శులెవరూ పింఛన్ నుంచి పన్ను వసూలు చేయకూడదన్నారు.



యూరియా కోసం నిరీక్షణ

దుబ్బాకలో యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కాదు. ఎప్పుడు వస్తుందో తెలియని యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలో నిలబడుతున్నారు. గంటల తరబడి ఎదురుచూసి, చివరికి నిరాశతో వెనుదిరుగుతున్నారు. సోమవారం దుబ్బాక మండలంలో 47 టన్నుల యూరియా వచ్చింది. ఇందులో హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ ఏజెన్సీ (హాకా18)కి 25 టన్నులు, దుబ్బాక డీసీఎంఎస్‌కు 22 టన్నులు కేటాయించారు. ఈ విషయం తెలిసిన రైతులు యూరియా కోసం రాత్రి నుంచే నిరీక్షించారు. మొత్తంగా 420 మంది రైతులకు మాత్రమే యూరియా లభించింది. మిగతా రైతులు ఖాళీ చేతులతో వెనుదిరిగారు. అక్కడి వ్యవసాయ విస్తరణ అధికారులు సంతోష్, హరీష్, సంధ్య, మనోజ్ఞలు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించారు.

– దుబ్బాక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి)



వర్షం కురిస్తే రాకపోకలు బంద్

- తాళ్లతండా, కట్కూర్ వాసులకు తప్పని ఇక్కట్లు

అక్కన్నపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం మల్లంపల్లి ఎల్లమ్మ వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కారణంగా వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో మల్లంపల్లి నుంచి కట్కూర్ వైపు వెళ్లే రైతులు, కూలీలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎమ్మెల్యే రూ. 50లక్షలతో వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారని, రెండుసార్లు గెలిచినా నిధులు మంజూరు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం పైపులు వేసి తాత్కాలికంగా నిర్మిస్తే రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు స్పందించి తాత్కాలికంగానైనా రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

సాగునీటి కోసం మరో ఉద్యమం!

- కాళేశ్వరంపై విషప్రచారం మాని పంటలకు నీరందించండి
- దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై విషప్రచారంమాని రైతుల పంటపొలాలకు సాగునీరు అందేలా చూడాలని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే సాగునీటి కోసం మరో ఉద్యమం చేపట్టి రైతులతో కలిసి సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేట శివారులోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి దుబ్బాకకు సాగునీటిని విడుదల చేసే ప్రధాన కాలువపై చేపడుతున్న పంపుహౌజ్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులను సోమవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ఉప కాలువల నిర్మించాలని ఎన్నిమార్లు మొరపెట్టుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. పంటలు ఎండిపోయి రైతు లు బాధపడుతుంటే ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయకుండా మంత్రి ఉత్తమ్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు కావస్తున్న ఇరిగేషన్ మంత్రిగా పనిచేస్తున్న ఉత్తమ్ మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల వద్ద అసంపూర్తిగా మిగిలిపోయిన ఉపకాలువల నిర్మాణ పనులపై అధికారులతో ఒక్కసారైనా రివ్యూ పెట్టారా? అని ప్రశ్నించారు. ఆయన వెంట కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు ఉన్నారు.



ఎల్లారెడ్డిపేటశివారులో డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనులను బక్కి వెంకటయ్యతో కలిసి పరిశీలిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

మున్సిపల్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాగ్వాదం

- చైర్‌పర్సన్ చాంబర్‌లో సీఎం ఫొటో ఏర్పాటు
- అధికారంలోకి వచ్చి 18 నెలలైనా పెట్టరా? : కాంగ్రెస్
- సీఎం, పీఎం ఫొటో పెట్టాలని చట్టంలో లేదు : బీఆర్‌ఎస్

సిద్దిపేట ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు సందర్భంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా.. మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో లేదంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు సాకి బాల్‌లక్ష్మి ఆనంద్, రియాజుద్దీన్‌లు ఫొటో ఏర్పాటు చేశారు. అక్కడే ఉన్న చైర్‌పర్సన్ ముంజులరాజనర్సు, వైస్ చైర్మన్ జంగిలి కనకరాజులు కాంగ్రెస్ కౌన్సిలర్లను ఉద్దేశించి బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పుడు 'మంత్రి హరీశ్‌రావు నాకు పునర్జన్మ ఇచ్చారని నిండు సభలో చెప్పి.. ఇప్పుడు ఆయనను విమర్శిస్తారా అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫోటో పెట్టుకున్నందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కొట్లాడి సిద్దిపేట మున్సిపల్‌కు నిధులు తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సీఎం, పీఎం ఫొటో పెట్టాలని మున్సిపల్ చట్టంలో లేదని అన్నారు. చట్టం గురించి తెలుసుకోకుండా దౌర్జన్యంగా చాంబర్‌లోకి వెళ్లి ఫోటోలు ఏర్పాటు చేయడం కాంగ్రెస్ కౌన్సిలర్ల అవివేకానికి నిదర్శనమన్నారు. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ సభ్యులు మాట్లాడుతూ తమ వార్డులకు నిధులు ఇవ్వలేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని.. తమను చిన్నచూపు చూశారని ఆరోపించారు. ఎస్‌డీఎఫ్ ఫండ్ కింద వార్డులకు నిధులు తీసుకొస్తే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ ఓర్వడం లేదని ఆరోపించారు. ఓ కౌన్సిలర్ మహిళలను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారని అర్థరహితంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆలకుంట కవిత, శ్రీదేవిబుచ్చిరెడ్డి, పూర్ణిమ ఎల్లంయాదవ్, నాయకులు ఆలకుంట మహేందర్, కాటం కిషన్, బుర్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అయితే, మున్సిపల్ కార్యాలయంలో సీఎం ఫొటో పెట్టే విషయం కాంగ్రెస్ కౌన్సిలర్లు వ్యవహరించిన తీరు సరిగ్గా లేదని సిద్దిపేట సుడా మాజీ డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు.



సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్

ఆరోపణలు అవాస్తవం

సిద్దిపేట మున్సిపల్‌లో అవినీతి జరిగిందని చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు, వైస్‌చైర్మన్ కనకరాజు స్పష్టంచేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆస్తి పన్ను కట్టమంటే కొందరు ప్రజాప్రతినిధులు అధికారులను టార్గెట్ చేస్తూ, ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కమిషనర్ చొరవ వల్లే పన్ను ఆదాయం పెంచడం సాధ్యమైందన్నారు. రూ. 1.70 కోట్ల ఆరోపణలపై ఆధారాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్తి పన్ను కట్టమంటే బెదిరంపులకు పాల్పడటం సమంజసం కాదన్నారు.

సైబర్ బాధితులకు మెరుగైన సేవలు..

సిద్దిపేట క్రైం ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సైబర్ బాధితులకు మెరుగైన సేవలను అందించడానికి సైబర్ వారియర్స్ కృషి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. సోమవారం ఆమె పోలీస్ కమిషనర్ కార్యాలయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నుంచి వచ్చిన టీషర్ట్స్‌ను సైబర్ వారియర్స్‌కు అందజేసి పలు సూచనలు చేశారు. బాధితుల నుంచి వచ్చే కాల్స్‌ను మాట్లాడి సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఏసీపీ శ్రీనివాస్, జిల్లాలోని సైబర్ వారియర్స్, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ఎండుగంజాయి పట్టివేత

పటాన్‌చెరు/మునిపల్లి ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో అక్రమంగా ఎండుగంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తిని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. త్రిపుర రాష్ట్రానికి చెందిన మంగళ్‌దెబ్బర్మా అనే వ్యక్తి 5.5 కిలోల ఎండుగంజాయిని సంగారెడ్డి వైపు మోటారుసైకిల్‌పై రవాణా చేస్తుండగా సీఐ శంకర్ పట్టుకుని పటాన్‌చెరు ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. గోవా నుంచి తీసుకెళ్తున్న గోవా మద్యాన్ని కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద గోవా నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేయగా అందులో 34 బాటిళ్లు (14.850 లీటర్స్) ఉన్నట్లు గుర్తించి పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గోవా మద్యాన్ని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం


కసాన్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

మాసాయిపేట/ చేగుంట ,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యే విధంగా అధికారులు చూడాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజు ఆదేశించారు. సోమవారం చేగుంట మండలంలోని కసాన్ పల్లి గ్రామంలో ఆకస్మికంగా సందర్శించి పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అంగన్‌వాడి కేంద్రం, గ్రామంలోని పారిశుధ్య పనులను, విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గ్రామంలోని శానిటేషన్ పనులను కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా సందర్శించి గ్రామంలో కలియతిరిగారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ


సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

మెదక్ అర్బన్ /సంగారెడ్డి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెండు జిల్లాల నలుమూలల నుంచి ప్రజలు, అర్జీదారులు భారీగా తరలివచ్చారు. మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ.. అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో బాధితుల సమస్యలు పరిష్కరించాలని సంగారెడిడ సబ్ కలెక్టర్ ఉమా హారతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను బాధితులకు వివరిస్తూ సమాచారం అందించాలని సూచించారు. పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధం అయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్,ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. మండల కేంద్రానికి చెందిన పబ్బ అశోక్ గుప్తా కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి కూలర్‌కు షార్ట్ సర్క్యూట్ రావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల తమకు భారీ నష్టం జరిగిందని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యలు అగ్ని ప్రమాద సంఘటనను పరిశీలించారు.

కుళ్లిన కోడి గుడ్లు పంపిణీ


కుళ్లిన గుడ్లు

చేర్యాల, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం చుంచనకోట గ్రామ ఎస్సీకాలనీలోని అంగన్‌వాడీకేంద్రంలో ఇటీవల పలువురికి పంపిణీ చేసిన కోడిగుడ్లు కుళ్లిపోయాయి.

గ్రామానికి చెందిన పొట్టి మానస ఇటీవల అందించిన గుడ్లను పరిశీలించగా కుళ్లిపోవడంతో ఖంగుతింది. ఇదేంటని అంగన్‌వాడీకేంద్రం నిర్వహకురాలికి వివరించగా, తామేం చేస్తామని సమాధానం ఇచ్చిందంటూ వాపోయింది. కొంతకాలంగా తరచూ కుళ్లిపోయిన గుడ్లనే అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించి నాణ్యత, ప్రమాణాలున్న మేలురకం గుడ్లను అందించాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిన్నశంకరంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని జీకేవైర్ పరిశ్రమ సమీపంలోని సోమవారం ఒక గుర్తు తెలయని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లిన స్థానికులకు మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు (40) ఉండొచ్చని చెప్పారు. చనిపోయిన వ్యక్తి మతిస్థిమితం లేదని తెలిపారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ కోసం మార్చురీలో ఉంచినట్లు ఎస్సై తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు.

ద్విచక్రవాహనంలో గేదె తాడు చిక్కి..

దుబ్బాక, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం రోడ్డుకు అడ్డంగా వచ్చిన గేదె తలుగు(తాడు) ద్విచక్రవాహనంలో చిక్కి ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ, సోమవారం మృతి చెందాడు. దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామానికి చెందిన ముదిగొండ రాజేశం(55) గ్రామంలో కిరాణ దుకాణం వ్యాపారం చేస్తాడు. అతడు, భార్య చంద్రకళతో కలిసి ఆదివారం కిరాణసామగ్రి కోసం దుబ్బాకకు వచ్చి వెళ్తుండగా, దుబ్బాక మున్సిపల్ చెల్లాపూర్ శివారులో కట్టేసిన గేదె రోడ్డుకు అడ్డంగా వచ్చింది. దాన్ని కట్టేసిన తాడు(తలుగు) ద్విచక్రవాహనంలో చిక్కి ప్రమాదానికి గురయ్యారు. తీవ్రగాయాలైన రాజేశంను దుబ్బాక నుంచి సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి అటునుంచి యశోద ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య , ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలై..

● చికిత్స పొందుతూ మహిళ మృతి

దుబ్బాక, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు తీసుకునేందుకు వెళ్లి రోడ్డుదాటుండగా ఓ మహిళను మోటర్‌సైకిల్ ఢీకొట్టడంతో ఆమె మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గుజ్జెటి కిష్టయ్య భార్య బాలమణి ఆదివారం సాయంత్రం గ్రామంలోని అంగడిలో కూరగాయలు తీసుకుని తిరిగి వస్తుండగా, సిద్దిపేట నుంచి వేగంగా వస్తున్న తప్పనగుల్లకు చెందిన రఘునందన్ మోటర్ సైకిల్ ఢీకొనడంతో ఆమెను సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లుగా భూంపల్లి ఎస్సై హరికృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కొమురయ్య (ఫైల్)

చేగుంట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన చేగుంట మండలం కర్నాల్ పల్లిలో జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాల్ పల్లి గ్రామానికి చెందిన గ్యాదరి కొమురయ్య (55) జూలై 20న చేగుంటలో యూరియా బస్తాలు తెస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. 15 రోజులైనా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకక పోవడంతో సోమవారం కొమురయ్య భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిగాచి బాధిత కుటుంబాలకు
పరిహారం ఒకే విడతలో చెల్లించాలి

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం ఒకే విడతలో చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సిగాచి పరిశ్రమ కార్మికుల కుటుంబాలతో కలిసి సోమవారం నిర్వహించిన నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. రూ.కోటి నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చారని, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇస్తామని రూ.4.5 లక్షలు మాత్రమే ఇచ్చి మోహం చాటేశారని విమర్శించారు. ఘోర ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యదర్శి సాయిలు, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన కూరగాయలతో వంటలు

● ప్రజావాణిలో ఫిర్యాదు గురుకుల పాఠశాల వంటమాస్టర్

ఝరాసంగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కుళ్లిపోయిన కూరగాయలతో చేసిన వంటలను విద్యార్థులకు వడ్డిస్తున్నారని మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల వంటమాస్టర్ వెంకటేశం సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి అధికారులకు ఫిర్యాదును అందజేశారు. అలా కుళ్లిపోయిన కూరగాయలతో తాను వంట వండనని, విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని అన్నందుకు పాఠశాల ప్రిన్సిపాల్ తనను దుర్భాషలాడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ తిరుమలరావు, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

మిరుదొడ్డి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశామని బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భైరయ్య తెలిపారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3న రామచంద్రపురంలోని సంకల్ప్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో సీనియర్, జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జట్లను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. సీనియర్ జట్టులో శశికుమార్, శ్రీనివాస్, చైతన్య, భార్గవ్, సాయికృష్ణ, రవి, కిరణ్‌కుమార్, రవితేజ, సబ్‌జూనియర్ బాలికల జట్టుకు శ్రావణి, నిహారిక, నందిత, లలిత, శరణ్య, సఫీయా, సోహా, జెస్సీ, మనోవర్ధిని, శ్రీతజ, తస్వీ, బాలుర జట్టుకు చైతన్య, కృష్ణసాయి, సాయిసిద్విక్, మణికంఠ, సాకేత్, మోయిన్, భువన్, అక్షిత, లలిత్, కౌశిక్‌లు ఎంపికయ్యారు. ఈనెల 23, 24న రాష్ట్రస్థాయిలో జరిగే బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొంటారని చెప్పారు.

భద్రాచలం రామాలయానికి పాదయాత్ర



భద్రాచలంకు పాదయాత్రగా వెళ్తున్న నాయకుడు వేణుమాదవ్

సదాశివపేట, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మంపై జరుగుతున్న అసాంఘిక శక్తుల దాడులను నిరసిస్తూ హైందవ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సదాశివపేటకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెమలికొండ వేణుమాదవ్ భద్రాచలం రామాలయానికి పాదయాత్ర చేపట్టారు. సోమవారం సదాశివపేట పట్టణం కృష్ణానగర్‌కాలనీలోని పంచముఖి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేశ్వరరావు, దేశ్‌పాండే, ఓదుల మాణిక్‌రావు, అంబదాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి టీచర్ లైంగిక వేధింపులు

● స్కూల్ ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు విద్యార్థినిని లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటన సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోని హైస్కూల్‌లో చోటుచేసుకున్నది. ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడు వినయ్ లైంగిక వేధింపులకు పాల్పడిన విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు తెలపగా, సోమవారం వారు ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేసే వినయ్ రోజు మానసికంగా వేధించేవాడని, బూతులు మాట్లాడేవాడని బయటికి విషయం చెప్పలేక లోలోన ఏడ్చేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ బిడ్డను లైంగికంగా వేధించిన టీచర్‌ను తమకు అప్పగించాలని తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన నిర్వహించగా పాఠశాల యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న సంగారెడ్డి పట్టణ పోలీసులు పాఠశాల వద్దకు చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీఐ రమేష్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడు వినయ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి పోక్సో కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం..
లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరి మృతి

గజ్వేల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పరిధిలోని రాణే పరిశ్రమ వద్ద రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుకవైపు నుంచి కారు ఢీకొట్టగా, ఇద్దరు యువకులు అక్కడిక్కడే దుర్మరణం చెందిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన రంగనబోయిన రాజ్‌కుమార్(26) తన భార్య సంధ్యతో కలసి మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో యాదాద్రి-భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లికి బోనాల పండుగ నిమిత్తం వెళ్లిన ఆయన ఆదివారం సాయంత్రం బస్సులో గజ్వేల్ మండలం అక్కారం మధిర గ్రామమైన కోనాపూర్‌కు వచ్చాడు. అక్కడి నుంచి తన బావమరిది అయిన రిప్పల సందీప్(19) (సంధ్య సోదరుడు)తో కలసి కారులో మేడ్చల్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో రాణే పరిశ్రమ వద్ద ముందు వెళ్తున్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ తలకు, సందీప్ ఛాతిలో బలమైన గాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ విషయమై రాజ్‌కుమార్ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

తండ్రికి పక్షవాతం..
మనస్తాపంతో కుమార్తె ఆత్మహత్య

నిజాంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : తండ్రి పక్షవాతానికి గురికాగా, సేవలు చేస్తూ బెంగతో కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం నార్లాపూర్‌లో విషాదాన్ని నింపింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బొడ్డు స్వామికి ఏడాది క్రితం నార్లాపూర్ గ్రామానికి గాలం లక్ష్మణ్ కూతురు జ్యోతి(24)తో వివాహమైంది. కాగా పెళ్లయిన కొద్దిరోజులకే లక్ష్మణ్‌కు పక్షవాతం వచ్చింది. తండ్రికి సేవ చేసేందుకు మూడు నెలల క్రితం జ్యోతి పుట్టింటికి వచ్చింది. అప్పటి నుంచి ఏదో కోల్పోయినట్టు బాధపడేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన జ్యోతి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జ్యోతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తెల్లారితే చాలు, వీరిది బతుకు పోరాటం. పొద్దుగూకే వరకు గొర్ల మందలతో అలుపెరగని పాదయాత్ర. జీవితమంతా జీవాలతోనే జీవనం. పండుగలు ఉండవు, పబ్బాలు లేవు. చలి, ఎండ, వానలతో సహవాసం చేస్తారు. ఊరికి దూరంగా సంచార జీవితం గడుపుతారు. రోజులు కాదు, నెలల తరబడి సాగుతూనే ఉంటారు. ఈ గాథ పాత మహబూబ్‌నగర్ జిల్లా కురుమలది. గొర్ల మందలతో పరకాల నుంచి హుస్నాబాద్ మీదుగా సిద్దిపేట రంగనాయకసాగర్ వైపు వెళ్తున్న వీరిని 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

- హుస్నాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి)



మందెంట పోతుండే ఎలమంద

వంతుల వారీగా ఇంటికి వెళ్తాం

మందలతో నెలల తరబడి ఉంటాం. వంతుల వారీగా ఇళ్లకు వెళ్తుంటాం. మళ్లీ మందకు చేరుకునేందుకు సెల్‌ఫోన్‌లు ఉండటంతో మావాళ్లు ఎక్కడున్నారో తెలుసుకోవడం సులభమైంది. సంచార జీవితం గడిపే మా కురుమలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలి. అంతేకాకుండా మాకు ఇన్సూరెన్స్ చేయించాలి.

- బేక్మారుపల్లి వెంకటేష్, మరికల్

జీవాల కోసం పచ్చిక బయళ్ల వెంట అలుపెరగని పాదయాత్ర

నెలల పాటు పల్లెకు దూరం.. గొర్ల మందతో సహజీవనం

పాలమూరు నుంచి సిద్దిపేట జిల్లాకు వలసొచ్చే కురుమలు

ఎండ, వాన, చలిలోనూ బతుకు పోరాటం

పాత మహబూబ్‌నగర్ జిల్లా, ప్రస్తుత నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం వీరి స్వస్థలం. నీటి వనరులు లేక, పచ్చగడ్డి దొరక్క మందలను తోలుకొని నీరు, పచ్చిక ఉన్న ప్రాంతాలకు వెళుతుంటారు. తరతరాలుగా ఇలా వెళ్తూనే ఉన్నారు. దగ్గర్లోనే నదులు ఉన్నా ఒక్క చుక్క నీరు దక్కక్క జీవాలతో సంచార జీవనయాత్రను సాగిస్తున్నారు. గతంలో ఏడాదికి పైగా మందలతోనే ఉండేవారమని, ఇప్పుడు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో రెండు నెలలకు ఒకసారి, ఏదైనా అత్యవసరమైతే నెలకోసారి వంతుల వారీగా ఇంటికి వెళ్లి వస్తున్నామని వారు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ జీవన యాత్ర సాయంత్రం ఏడు గంటల వరకు కొనసాగుతుంది. రాత్రిపూట ఊర్లకు దూరంగా మైదానాల్లో బస చేసి, మందల మధ్యే వంటలు చేసుకుంటారు. ఈ వర్షాకాలంలో వీరి కష్టాలు వర్ణనాతీతం. వంట చేసుకోవడానికి, పడుకోవడానికి చాలా ఇబ్బందులు పడతారు. అయితే, సెల్‌ఫోన్‌లు ఉండడంతో ఇంటి క్షేమ సమాచారాలను ఎప్పటికప్పుడు తెలుసుకోగలుగుతున్నారు. ప్రస్తుతం ఎనిమిది మంది కురుమలు దాదాపు 1500 గొర్లతో హుస్నాబాద్ మీదుగా సిద్దిపేటకు వెళ్తున్నారు. రోజుకు కనీసం 15 కిలోమీటర్ల మేర నడుస్తూ, గొర్లను మేపుకుంటూ ప్రయాణం సాగిస్తారు.


అనారోగ్యం బారిన గొర్రె పొట్టేలుకు మందు పోస్తున్న కురుమలు

పండుగలకు వెళ్లలేం

ఈ మందలతో పండుగలకు ఇంటికి పోవడం కుదరదు. బంధువులు చనిపోయినా వెళ్లలేం. చిన్నప్పటి నుంచి మందలతోనే జీవిస్తున్నాను. మాకు వ్యవసాయ భూమి ఉన్నా నీళ్లు లేకపోవడం వల్ల ఇలా సంచార జీవితం గడుపుతున్నాం. ఈ జీవాలే మాకు జీవనాధారం. మా తాతలు, తండ్రుల నుంచి వస్తున్న ఈవృత్తిని బతుకుతెరువు కోసం కొనసాగి

- పొకిటి ఆంజనేయులు, మరికల్, నారాయణపేట జిల్లా

తెలంగాణ జిల్లాల్లోనే సంచారం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లడం మానేశామని కురుమలు తెలిపారు. ఇప్పుడు గజ్వేల్, ప్రజ్ఞాపూర్, కొముర్వెల్లి, చేర్యాల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, పరకాల ప్రాంతాల్లో సంచరిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతాల్లో రెండు నుంచి మూడు నెలలు ఉండి, మళ్లీ హుస్నాబాద్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి మీదుగా పరకాల వైపు తిరిగి వెళుతుంటామని వివరించారు. గొర్లను రోగాల బారిన పడకుండా వారే సొంతంగా వైద్యం చేసుకుంటారని, కొన్నిసార్లు చిటుకు రోగాలు వస్తే పదుల సంఖ్యలో జీవాలు చనిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయారు. ఇంటి ఖర్చులకు, ఇతర అవసరాలకు గొర్లను అమ్ముతుంటారు. వీరి మీద నమ్మకంతో వ్యాపారులు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఒక్కో గొర్రెకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ధర వస్తుంది.


ఓ చెట్టు కింద వంట చేసుకుంటున్న గొర్రెలకాపరులు



సామగ్రి మోసేందుకు గాడిదలు

తమ నిత్యావసర వస్తువులు, బట్టలు, ఇతర సామగ్రిని మోసేందుకు గాడిదలను ఉపయోగిస్తారు. ఒక్కో గాడిదను రూ.20 వేల వరకు పెట్టి కొనుగోలు చేస్తారని చెప్పారు. ఈ గాడిదలు ఎంత బరువైనా మోస్తాయని తెలిపారు. గొర్రెలకు ఏదైనా రోగాలు వచ్చి నడవలేకపోతే, వాటిని ఆటోల ద్వారా దగ్గరలోని పశువుల ఆస్పత్రికి తీసుకెళ్తారని తెలిపారు. పొలాల్లో గొర్రెలు మేస్తే జరిమానాలు చెల్లించిన సందర్భాలు కూడా ఉన్నాయని వారు చెప్పారు.


గొర్రెకాపరుల సామగ్రితో గాడిదలు

పల్లె ప్రజలు, రైతాంగ
సాధికారతతోనే జాతీయ సమైక్యత

● గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
● 'గీతం'లో జాతీయ చర్చాగోష్ఠి ప్రారంభం


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఐక్యతకు చిహ్నం భారత్ అని, పల్లె ప్రజలు, రైతాంగ సాధికారతతోనే దేశ సమైక్యత బలోపేతమవుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సును ఆయన సోమవారం ప్రారంభించారు. 'సర్దార్ వల్లభాయ్ పటేల్, రైతులు: చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు' అనే అంశంపై పొలిటికల్ సైన్స్ విభాగం చర్చాగోష్ఠిని నిర్వహించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ గొప్ప పాత్ర పోషించారని కొనియాడారు. రైతు ఉద్యమాలకు పటేల్ చేసిన సేవలు అంతగా వెలుగులోకి రాలేదని అన్నారు. చారిత్రక బార్డోలి సత్యాగ్రహం (1928)లో పటేల్ నాయకత్వాన్ని, రైతులు, భూమిలేని కార్మికుల సాధికారత కోసం ఆయన చేసిన కృషిని గవర్నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గ్రామీణ భారతదేశం జాతికి ఆత్మలా మిగిలిపోతుందని చెప్పారు. పేదలు, అణగారిన వర్గాలతో మన జీవితాలను పంచుకోవడంలో ఆనందం ఉందని జిష్ణుదేవ్‌వర్మ వ్యాఖ్యానించారు. సదస్సు ప్రారంభానికి ముందు గవర్నర్ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. గుజరాత్ ప్రభుత్వ ఇండెక్స్‌టీ-సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ సంజయ్ జోషి 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' విశిష్టతను వివరించారు. సామాజిక సమరసత మంచ్ జాతీయ కన్వీనర్ కె.శ్యామ్‌ప్రసాద్ పటేల్ నాయకత్వం గురించి మాట్లాడారు. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డిఎస్.రావు స్వాగతోపన్యాసం చేశారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ గుబ్బం అశోక్ వందన సమర్పణతో ప్రారంభ కార్యక్రమం ముగిసింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా అనేక మంది ప్రముఖ పండితులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. వీరిలో గుజరాత్‌లోని సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వసంత్ కుమార్ ఆర్.పటేల్, ములుగులోని సమ్మక్క సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ షీలారెడ్డి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి జి.నాగరాజు తదితరులు ఉన్నారు.

దళితులపై దాడి చేసిన
పోలీసులపై చర్యలు తీసుకోవాలి

డీబీఎఫ్ ఆధ్వర్యంలో మెదక్ అడిషనల్ ఎస్పీకి బాధితుల వినతి

మెదక్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా చేగుంట మండలం బోనాల కొండాపూరం గ్రామంలో దళితులపై దాడి చేసిన చేగుంట, భైంసా పోలీసులపై కేసు నమోదు చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఘటనలో మఫ్టీలో ఉన్న పోలీసులు ఓ కేసు విచారణ పేరుతో జూన్ 18న దళిత యువకుడు సురేష్‌ను చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. భయపడిన సురేష్ ఇంటికి పారిపోయి, కాలనీలోని ప్రజలకు చెప్పడంతో వారు మఫ్టీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, ఒకరు దొరికారని అతన్ని మాజీ సర్పంచ్‌కు అప్పగించి చేగుంట పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. అయితే, పోలీసులు విచారణ లేకుండానే అతడిని విడిపించేందుకు ప్రయత్నించడంతో గ్రామస్థులు అడ్డుకోగా, కాలనీలో లాఠీచార్జి చేశారని ఆరోపించారు. ఈ దాడిలో అనేక మందికి గాయాలయ్యాయని, పోలీసులు మహిళా కానిస్టేబుల్ లేకుండానే మహిళలను అరెస్ట్ చేసి వెంట్రుకలు పట్టి లాగి జీపులో తరలించారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎనిమిది మందిపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ కేసులను వెంటనే ఎత్తివేయాలని, దాడి చేసిన చేగుంట ఎస్ఐ చైతన్యరెడ్డి, భైంసా ట్రైనీ ఎస్ఐ, కానిస్టేబుళ్లతో పాటు ఘటనలో ఉన్న పోలీసులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణకు ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌లకు కూడా ఫిర్యాదు చేసి పోరాటం చేస్తామన్నారు. స్పందించిన అడిషనల్ ఎస్పీ, తూప్రాన్ డీఎస్పీతో మాట్లాడి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

శ్రావణ పూజలు


కోహీర్ మండలం బడంపేట రాచన్నస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న భక్తులు

కోహీర్/పెద్దశంకరంపేట/నారాయణఖేడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకుని కోహీర్ మండల పరిధి బడంపేట శ్రీరాచన్నస్వామి ఆలయంలో, పెద్దశంకరంపేట మండల పరిధిలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. బడంపేట శ్రీరాచన్నస్వామి ఆలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన చేశారు. పెద్దశంకంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర ఆలయం, పేట శివారులోని గురుపాదప్పగుట్ట శ్రీభ్రమరాంభ మల్లికార్జున స్వామి, గొట్టిముక్కులలోని రాజులగుట్టపై వెలసిన శివాలయంలో విశేష పూజలను నిర్వహించారు. కొప్పోలు ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి జలాభిషేకం, పత్రి పూజ చేశారు. నారాయణఖేడ్ మార్కండేయ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, భస్మాహారతి పూజలను నిర్వహించారు.


పెద్దశంకరంపేట మండలంలో కొప్పోల్‌లో పూజలు చేస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

ఆహార ఉత్పత్తుల యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి పార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ) పథకం ఆహార ఉత్పత్తుల యూనిట్ల నమోదుకు ఆసక్తి గల స్వశక్తి సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హుస్నాబాద్ పట్టణంలోని మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రతీ యూనిట్‌కు రూ. ఒక లక్ష నుంచి రూ. 30 లక్షల వరకు రుణం తీసుకోవచ్చని, ఇందుకు 35 శాతం నుంచి రూ. 10 లక్షల వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ విషయంపై మంగళ, బుధవారాల్లో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ప్రదర్శన ఉంటుందని, ఏపీఎంలు, సీసీలు బాధ్యతగా తమ గ్రామాల సభ్యులను తీసుకురావాలని కోరారు. అలాగే ఆసక్తి గల సంఘాలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నకిలీ ఎరువులను అరికట్టాలి

కొమురవెల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పంటలకు పనిచేయనీ నకిలీ ఎరువులను రైతులకు విక్రయించే దందా జిల్లాలో కొనసాగుతున్నదనీ దీనిని వెంటనే అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రైతు సంఘం కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓ ప్రముఖ కంపెనీ ఎరువులను కృతిమ కొరత సృష్టించి అధిక లాభాల కోసం నకిలీ ఎరువులను రైతులకు అమ్మి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఇంతా జరుగుతున్న వ్యవసాయ అధికారులు ఎందుకు అరికట్టలేకపోతున్నారనీ ప్రశ్నించారు. నకిలీ ఎరువులను అరికట్టకపోతే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బద్దిపడగ కృష్ణారెడ్డి, సాయిలు, మల్లేషం శ్రీనివాస్ తదితరలు పాల్గొన్నారు.

నేటివ్ ఇండియన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా దండే యాదగిరి

గజ్వేల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నేటివ్ ఇండియన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన దండే యాదగిరిని నియమించారు. సోమవారం నేటివ్ ఇండియన్స్ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు బీరయ్య యాదవ్ ఈ విషయాన్ని వెల్లడించారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డిభవన్‌లో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.

సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి

కొమురవెల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువన్నపేట గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎస్ఐ రాజు గౌడ్, షీటీమ్ పోలీసులు షీటీమ్ పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజుగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య

మిరుదొడ్డి,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి):ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నట్టు మిరుదొడ్డి మండల విద్యాధికారి ప్రవీణ్‌బాబు పేర్కొన్నారు.. సోమవారం మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలలోని రికార్డులను, విద్యార్థులకు చేస్తున్న బోధన తీరును పరిశీలించారు.

కొత్త బంగారు లోకం..

- తల్లిదండ్రులతో అనుబంధాల మాటున పూర్తయిన స్కూల్ చదువులు
- కొత్త స్నేహితులతో వ్యక్తిత్వ వికాసం.. భవిష్యత్తుకు తొలిమెట్టు
- సరికొత్త ఆశలతో జూనియర్ కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థినులు


హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినిలు

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు నేడు సరికొత్త ఆశలతో కళాశాలల్లో అడుగుపెట్టారు. ఇంతవరకు క్రమశిక్షణతో పాఠశాల చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థుల ఊహలు రెక్కలు విచ్చుకుంటున్న వేళ ఎన్నో ఊహలు, ఆశలు, ఆశయాలతో కళాశాలల్లో చేరారు. ఇన్నాళ్లు పాఠశాల విద్యతో ఇంటి అనుబంధంతో అమ్మనాన్నల మధ్య ఉన్నవారు ప్రస్తుతం కళాశాలల్లో చేరి కొత్త స్నేహితులతో కొత్త వాతావరణానికి అలవాటు పడుతున్నారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ చదువు వారి జీవితానికి తొలిమెట్టు కావడంతో విద్యార్థులు ఇప్పుడు తమ భవిష్యత్తును నిర్ధేశించుకునే కీలక సమయమని వ్యక్తిత్వవికాస నిపుణులు, అధ్యాపకులు పేర్కొంటున్నారు. అందుకే పాఠశాల చదువు పూర్తి చేసుకొని కాలేజీలో చేరిన విద్యార్థులకు మొదటగా కెరీర్ గైడెన్స్‌పై సలహాలు, సూచనలు ఇస్తున్నామని లెక్చరర్లు చెబుతున్నారు. ఇన్నాళ్లు పాఠశాలల్లో చదువుకొని నూతనంగా కళాశాలల్లో అడుగుపెట్టిన హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినుల మనోగతం వారి మాటల్లో...

కెరీర్ గైడెన్స్‌పై సలహాలు ఇస్తున్నాం



పాఠశాల పూర్తి చేసుకొని కాలేజీలో చేరే విద్యార్థినులకు మొదటగా కెరీర్ గైడెన్స్‌పై సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పోటీ పరీక్షల్లో ప్రతిభను కనబర్చే విధంగా శిక్షణ ఇస్తున్నాం. ముఖ్యంగా కాలేజీలో చేరినవారికి పరీక్షల పట్ల భయం, ఒత్తిడి, డిప్రెషన్‌ని అధిగమించే విధంగా హెల్ప్-టెలిమానస్ ద్వారా ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మానవ అక్రమ రవాణా వ్యతిరేక చర్యపై అవగాహన కల్పిస్తున్నాం.

- వి లలిత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ, హుస్నాబాద్

కాలేజీ అంటే భయం అనిపించింది



కాలేజీ అంటే మొదట్లో కొంత భయం అనిపించింది. లెక్చరర్లు అర్థమయ్యే విధంగా బోధన చేయడం వల్ల ఆ భయం పోయింది. హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల కళాశాలలో రిజల్ట్స్ బాగున్నాయని తెలిసి జాయిన్ అయ్యాను. పాఠశాల స్నేహితులు దూరమయ్యారని కొంత బాధగా ఉన్నా కాలేజీ వాతావరణం బాగా నచ్చింది.

- చల్ల హాసిని, ఎంపీసీ ఫస్టియర్

కొత్త పరిచయాలతో ఆనందం



పాఠశాలలో కొంత అల్లరితో, చిలిపితనంతో ఉండే వాళ్లం. కాలేజీకి, స్కూల్‌కు ఎంతో తేడా ఉంది. కాలేజీలో చేరిన తరువాత మా ఆలోచన తీరులో కొంత మార్పు వచ్చింది. స్కూల్‌లో ఉపాధ్యాయులు క్రమశిక్షణతో ఉండటమెలాగో చెప్పేవారు. ఇక్కడ అంతట మేమే క్రమశిక్షణగా ఉండటం నేర్చుకున్నాం. కొత్త స్నేహితుల పరిచయాలతో వ్యక్తిత్వ వికాసం పెంపొందేందుకు అవకాశముంది. స్టడీ అవర్స్‌తో చదువుపట్ల మక్కువ పెరిగి చక్కటి భవిష్యత్తును పొందగలమనే ఆత్మవిశ్వాసం కలుగుతుంది. మొత్తానికి కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లుగా ఉంది.

- అంతడ్పుల సుగంధ, సీఈసీ ఫస్టియర్

ముర్రుపాలు పిల్లలకు ఎంతో మేలు


జాలిగామలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని


మద్దూరు: దబ్బతండాలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

గజ్వేల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి ముర్రుపాలు రోగ నిరోధక శక్తితో పాటు పిల్లలకు ఎంతో మేలు చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని పేర్కొన్నారు. సోమవారం మండలంలో జాలిగామ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సామూహిక అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తల్లి బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే శిశువుకు ముర్రుపాలు పట్టించాలని, దీంతో అనేక పోషకాలు లభిస్తాయని ఆమె పేర్కొన్నారు.

- **మద్దూరు :** కొండాపూర్‌లోని దుబ్బతండాలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచరు సరస్వతి తండాలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌రెడ్డి, ఆశాలు పాల్గొన్నారు.

- **మిరుదొడ్డి:** పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. సోమవారం మిరుదొడ్డితోపాటు మండలం చెప్యాల గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రేణుక, గర్భిణీస్త్రీలు, బాలింతలు తదితరులున్నారు.

నానో యూరియాతో పర్యావరణ పరిరక్షణ


కొండపాక: బందారంలో డ్రోన్‌తో నానో యూరియా పిచికారి చేయడంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొండపాక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ సాంకేతికతలో భాగంగా నానో యూరియా, నానో డీఏపీ వాడకంతో వాతావరణ కాలుష్యం తగ్గించడమే కాకుండా సమర్థవంతమైన ఫలితాలను పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి స్వరూపరాణి పేర్కొన్నారు. మండలంలోని బందారం గ్రామంలో సోమవారం ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ సంస్థ వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నానో యూరియా నానో డీఏపీ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సాధారణంగా ఉపయోగించే పొడి యూరియా, డీఏపీ మొక్కలకు కేవలం 30 నుంచి 40 శాతం మాత్రమే ఉపయోగపడుతుండగా, మిగతాది నేలలో గాలిలో కలిసి కాలుష్యానికి దారితీస్తుందన్నారు. ఒక 500మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ ఒక సంప్రదాయ 45 కిలోల యూరియా బ్యాగుకు సమానమైన పోషకాలను పంటలకు అందించగలదని తెలిపారు. నానో యూరియా ధర మార్కెట్లో 500 మిల్లీ లీటర్ల బాటిల్‌కు రూ.225 గా ఉందన్నారు. కాగా పలువురు రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలపై డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారి చేసి రైతులకు చూపించారు. కార్యక్రమంలో గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్ బాబు, ఏవో జి.శివరామకృష్ణ, ఇఫ్కో ఏరియా మేనేజర్ చంద్రబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బట్ట పరశురాములు ఏఈవోలు, తోర్నాల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

- **మిరుదొడ్డి:** ఆయిల్‌ఫాం తోటలను సాగుచేసి రైతులు అధిక లాభాలు పొందాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల వ్యవసాయధికారి సత్యన్వేష్ అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం, భూంపల్లి గ్రామాల్లో ఆయిల్ ఫాం తోటలపై రైతులకు అవగాహన కల్పించారు.

- **రాయపోల్:** ప్రస్తుతం పత్తి చేలల్లో రసం పీల్చు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ సూచించారు. సోమవారం రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లి గ్రామంలో పత్తి పంటలను పరిశీలించారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి

గజ్వేల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19, 20, 21, 22 తేదీల్లో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బొమ్మల రామారంలో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భట్టు దయానందరెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను సోమవారం ఆయన సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణతో కలసి ఆవిష్కరించారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి


దుబ్బాకలో శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయం బ్రహోత్సవాల్లో గరుడ ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

దుబ్బాక, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరాలయం బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సుమారు 3వేల మంది దంపతులకు గరుడ ప్రసాద వితరణ జరిపారు. సోమవారం తెల్లవారు జామున యాదవులతో ఊరేగింపుగా వచ్చిన భక్తులు స్వామివారి ఆలయ ద్వార ప్రవేశం చేశారు. స్థానిక యాదవ సంఘం సభ్యులు మేళతాలాల మధ్య నూతన వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం శాంతిపాఠం, యాగశాల ప్రవేశం, ద్వాదశ కలశారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణంతోపాటు సంతానం కలగని దంపతులకు గరుడ ప్రసాదాన్ని అందజేశారు. ప్రత్యేక హోమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, యాదవ సంఘం నాయకులు తదితరులున్నారు.

సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పటేల్‌పురలోని శ్రీసంతోషిమాత ఆలయ 33వ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ప్రతీ రోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, భజనలు పారాయణాలు కొనసాగుతున్నాయి. మహా పూర్ణాహుతి అనంతరం భక్తులకు ఆశీర్వచనం, అన్నప్రసాదము అందజేశారు. అలాగే మంగళవారం రోజున రథయాత్ర ఉంటుందని ఆలయ మాజీ చైర్మెన్ డా. మాంకాల నవీన్ కుమార్ తెలిపారు.

పొట్లపల్లి ఆలయంలో భక్తుల సందడి

- **హుస్నాబాద్‌రూరల్:** శ్రావణ మాసం సందర్భంగా సోమవారం హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణ మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


సిద్దిపేటలోని సంతోషిమాత ఆలయంలో నిర్వహిస్తున్న మహా పూర్ణాహుతి

- **ములుగు:** వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులు అందరికీ లభించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ములుగు మండలం మామిడాల గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాల్లో పాల్గొన్నారు. వెంట మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, మాజీ సర్పంచ్ సత్తయ్యచారి, కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


హుస్నాబాద్ మండలం పొట్టపల్లి స్వయంభూ ఆలయంలో స్వామివారికి భక్తుల అభిషేకం

ఐనాపూర్‌లో చోరీ

కొమురవెల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐనాపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ ఘటన చోటు చేసుకున్నది. ఎస్ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐనాపూర్ గ్రామానికి చెందిన బచ్చల బాలలక్ష్మి ఆదివారం పని నిమిత్తం బయటకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకునేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న రూ.8 వేలు, 10తులాల వెండి పట్టగొలుసులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రావడంలేదని కాలువలోకి దూకిన భర్త

కుకునూరుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని భర్త కాలువలో దూకాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని ముద్దపూర్‌లో చోటు చేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ముద్దపూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని అహ్మదీపూర్ గ్రామానికి చెందిన క్యాసార బోయిని స్వామి(40)కి ఇచ్చి వివాహం చేయగా కొద్ది రోజుల పాటు సాఫీగానే సాగిన తరువాత స్వామి మద్యానికి బానిసై రోజు తాగి వస్తు భార్యని ఇబ్బందులకు గురి చేసేవాడు. దీంతో విసిగిపోయిన ఆమె కొడుకును తీసుకుని ముద్దపూర్‌లోని తల్లిగారి ఇంటి వద్ద కూలి పని చేసుకుంటూ ఉంటున్నది. స్వామి పలుమార్లు బతిమిలాడినప్పటికీ భార్య రాకపోవడంతో సోమవారం సాయంత్రం మద్యం మత్తులో ముద్దపూర్ శివారులోని మల్లన్నసాగర్ కాలువలోదూకాడు. కాలువలో నీరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కానీ గాయాలు కావడంతో అతడిని ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల వితరణ


ఘనపూర్ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఫారూఖ్ హుస్సేన్‌తో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తదితరులు

తొగుట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దేశంలో పేదలకు విద్య, వైద్యం నేటికీ అందని ద్రాక్షగా మారిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్ మనుమలు, మనుమరాలు ఎండీ కరీమోద్దీన్, యాసీనుద్దీన్, అయేషా సుల్తానాల జన్మదినం సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు సమకూర్చగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఫారుఖ్‌హుస్సేన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజలి, సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బీజేపీ

గజ్వేల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఆమోదం చేసి పార్లమెంటుకు పంపించిన బీసీ రిజర్వేషన్ ఆర్డినెన్స్‌ను బీజేపీ అడ్డుకుంటుందని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య ఆరోపించారు. సీపీఎం పార్టీ గజ్వేల్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, పార్లమెంట్‌లో ఆర్డినెన్స్‌ను ఆమోదించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తూ తెలంగాణలో మాత్రం వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి యజమానులకు అనుకూలంగా కార్మిక కోడ్‌లు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు బండ్ల స్వామి, రాణి, వెంకటాచారి రాజు, ఐలయ్య, లక్ష్మి, స్వామి తదితరులున్నారు.

కొత్త జిల్లాల వారీగా సహకార సంఘాల విభజన!

(5వ పేజీ తరువాయి)

చైర్మన్‌తో పాటు డీసీసీబీ స్థాయిలోనూ పదవులు దక్కే అవకాశం ఉందని భావిస్తున్న ఆశావహులు ఈ విషయంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జిల్లాలో 12 నూతన ఫాక్స్ సంఘాలు ఇవే..

సిద్దిపేట జిల్లాలో కొత్తగా 12 నూతన సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. అందులో నూతనంగా ఏర్పాటైన మండలాల్లో అక్బర్‌పేట-భూంపల్లి, రాయపోలు, మార్కుక్, ధూళిమిట్ట, అక్కన్నపేట, కుకునూరుపల్లి, సిద్దిపేట రూరల్, కొమురవెల్లి, హుస్నాబాద్ నుంచి రామవరం, చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్, గజ్వేల్ నుంచి పిడిచెడ్, నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలలో కొత్తగా పీఏసీఎస్‌లుగా ఏర్పాటు చేయనున్నారు.

విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన ఉండాలి


మాచాపూర్ శివారులోని పొలంలో వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, పంటల సాగు విధానం పై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట రూరల్ మండలం మాచాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పన్యాల జనార్దన్ రెడ్డి తెలిపారు. సోమవారం విద్యార్థులకు సాగుబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాల సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద క్షేత్రస్థాయిలో వ్యవసాయం, పరికరాలు, పంటల సాగులో మెళకువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వరి పొలంలో నాట్లు వేసి క్షేత్రస్థాయిలో రైతుల సాదకబాధకాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాధిక, బి.రాజయ్య, ఏ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టడమే వారి లక్ష్యం


గజ్వేల్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను రచ్చ చేసేందుకు ప్రతాప్‌రెడ్డి కుట్ర పన్నగా, అందులో నాయిని యాదగిరి, మల్లారెడ్డి పావులుగా మారినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాయకులు సమీర్, నక్క రేగొండగౌడ్, మొనగారి రాజు, రాములు గౌడ్, అంజి యాదవ్‌లతో కలసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో తమకు ఎలాగూ స్థానం లేదని గ్రహించిన వారు ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా, మంత్రి వివేక్ వెంకటస్వామి సభను రచ్చ చేసేందుకు ముందే ప్లాన్ సిద్ధం చేసుకున్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నేతృత్వంలో రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియ వర్గల్, ములుగు, మర్కుక్, జగదేవపూర్ మండలాల్లో ప్రశాంతంగా జరగగా, గజ్వేల్‌లో మాత్రం వ్యతిరేకుల ద్వారా రచ్చ జరిగిందన్నారు. గజ్వేల్‌లో రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించడానికి మంత్రి సిద్ధమవుతున్న తరుణంలో నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డితో పాటు మరో ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా కోవర్టు రాజకీయాలు చేస్తూ వారు కుట్ర పన్నినట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ లబ్ధికోసం కలసి మెలసి ఉంటున్న మైనంపల్లి హన్మంతరావు, తూంకుంట నర్సారెడ్డి మధ్య చిచ్చుపెట్టేలా నాయిని యాదగిరి వ్యవహరిస్తున్నారన్నారు. వారివెంట నాయకులు శేఖర్, కన్నాయాదవ్, డప్పు గణేష్, బాలు, అరుణ్, సురేష్ తదితరులున్నారు.

అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదు

కొండపాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పై అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదని కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నర్సారెడ్డి ప్రతీ కార్యకర్తను సమానంగా చూస్తూ తన కుటుంబ సభ్యుల వలె ప్రవర్తిస్తారని, అలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీలో కలిసి అందరూ కలిసికట్టుగా పనిచేయాలి కానీ గ్రూపులతో వర్గాలతో విడగొడుతూ రాజకీయాలు చేయడం సరైనది కాదన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పరశురాములు డైరెక్టర్ మల్లికార్జున్ రవీందర్ ఉన్నారు.

సముద్రాలలో కుంట శిఖం భూమి ఆక్రమణ


సముద్రాలలో తహసీల్దార్, డీఈకి వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

కోహెడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం సముద్రాల గ్రామంలో గాండ్లవారి కుంట వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ స్థలంగా భావించి వారం రోజులుగా భూమిని ఆక్రమిస్తున్నారని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరోపించారు. సిద్దిపేట-హన్మకొండ ప్రధాన రహదారిపై సముద్రాల గ్రామ స్టేజీ వద్ద రాస్తారోకో చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ డీఈ, తహసీల్దార్ సమీర్ అహమ్మద్ వెంటనే స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. విచారణలో కుంట కట్ట కొంత ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని, కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

దౌల్తాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని రాష్ట్ర డిలిమిటేషన్ కమిటీ మెంబర్ పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడేవారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

రెవెన్యూ డివిజన్ కోసం బైక్ ర్యాలీలు

చేర్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల రెవిన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేస్తూ నేటినుంచి ఈనెల 25తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు కొమురవెల్లి మండలం, 7వతేదీన ధూళిమిట్ట, 11న మద్దూరు మండలం, 14న చేర్యాల మండలం, 18న చేర్యాల పట్టణంలో బైక్‌ర్యాలీ చేపట్టనున్నామన్నారు. ఈనెల 25వతేదీన దుద్దెడ క్రాస్‌రోడ్డు వద్ద రాజీవ్ రహదారిని ముట్టడించనున్నట్లు తెలిపారు.

ల్యాబ్‌లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

చిన్నకోడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ల్యాబ్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ప్రాక్టికల్స్ చేసేటప్పుడు విద్యార్థులకు గ్లౌజులు, మాస్కులు అందజేయాలని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ల్యాబ్‌లో గత శనివారం ప్రమాదవశాత్తు విద్యార్థులపై రసాయన ద్రవ పదార్థం పడి గాయాలైన నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్వీ నాయకులు కళాశాలను సందర్శించి ప్రమాద వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని సోమవారం తహసీల్దార్‌కు ఏబీవీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. అలాగే హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లోని హాస్టళ్లకు సొంత భవనాలు లేక కొన్నేళ్ళుగా అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ఈ విషయంపై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదన్నారు.